సాక్షి రంగారెడ్డి

శనివారం । 25 । జనవరి । 2025



భిన్నమతాల సమ్మేళనం

భిన్నమతాల సమ్మేళనం జేపీ దర్గా అని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం అన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 10లో▸



భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

ఆమనగల్లు సమీపంలోని సైదులు దర్గాలో శుక్రవారం గంధోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 10లో▸



మెరుగైన వైద్యం అందించండి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధారాణి అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

శత చండీ యాగానికి ముమ్మరంగా ఏర్పాట్లు



కందుకూరు: మండలంలోని దాసర్లపల్లి సమీపంలో ఉన్న శ్రీమాత క్షేత్రంలో ఈ నెల 26 నుంచి 28 వరకు 108 యజ్ఞ గుండాలతో శ్రీరుద్ర సహిత శత చండీ యాగం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం యాగం నిర్వహణ ఏర్పాట్లను ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని శ్రీమాత వేద విజ్ఞాన్ ప్రచార పరిషత్ నిర్వాహకుడు రేవెళ్ల రాజు శర్మ కోరారు.

నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ రాక

మహేశ్వరం: మండల పరిధిలో అభివృద్ధి పనులను ప్రారంభించడానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం రానున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమనగంటి ప్రశాంత్‌రెడ్డి, నేనావత్ రాజు నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహేశ్వరం మండల కేంద్రానికి మధ్యాహ్నం 12.30 గంటలకు మంత్రి రానున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

కందుకూరు మండలంలో..

కందుకూరు: మండల పరిధిలో అభివృద్ధి పనులను ప్రారంభించడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం రానున్నారని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కందుకూరు చౌరస్తాలో మధ్యాహ్నం 1.30 గంటలకు భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చిలుకూరులో దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్



వీరయ్య కుటుంబ సభ్యులకు ఆశీర్వాదం అందజేస్తున్న అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి గర్భగుడిలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ ఆయనకు స్వామివారి శేషవస్త్రాలు, పూలమాలలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో వీరయ్య కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.నర్సింహాచారి, జిల్లా అధ్యక్షుడు సురేష్, సభ్యులు రమేష్, జ్ఞానేశ్వర్, విజయ్‌కుమార్, నర్సింహాచారి, శేఖర్, రాధా, వడ్డె రమేష్, కృష్ణగౌడ్, దశరథ్, పరమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల కమిటీ ఎన్నికకు దరఖాస్తు చేసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: దివ్యాంగుల శాఖలో పని చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి కేటగిరీ కింద (ఐదుగురు సభ్యులు దివ్యాంగుల స్వచ్ఛంద సంస్థల నుంచి) దివ్యాంగుల సమస్యలు, సేవల కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థలకు సంబంధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అందులో ఒకరు మహిళ అయి ఉండాలని, ఒకరు షెడ్యూల్ కులం వర్గానికి చెందిన అభ్యర్థి లేక షెడ్యూల్డ్ తెగలు వర్గానికి చెందిన వారు అయి ఉండాలన్నారు. రెండవ కేటగిరీ కింద(ఐదుగురు సభ్యులు దివ్యాంగుల్లో పరిజ్ఞానం, అనుభవం కలిగిన వారి నుంచి) దివ్యాంగుల సమస్యలపై అవగాహన కలిగి సేవా దృక్పథం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరిలో మహిళ, ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన అభ్యర్థి అయి ఉండాలన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ సాయంత్రం లోపు అన్ని ధ్రువీకరణ పత్రాలతో జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

అభివృద్ధి పరుగులు.. ఆనంద క్షణాలు

- 'పుర' సేవలో చైర్మన్లు, చైర్‌పర్సన్లు
- ఈనెల 26తో ముగుస్తున్న పాలక వర్గాల గడువు

మున్సిపల్ పాలక వర్గాల గడువు ఈ నెల 26తో ముగియనుంది. మౌలిక సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా చైర్మన్లు, చైర్‌పర్సన్లు ఇంతకాలం పనులు చేపట్టారు. తమ పదవీ కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు సంతృప్తినిచ్చాయని, ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టమని తెలిపారు. 'సాక్షి'తో తమ అనుభవాలను పంచుకున్నారు..

ఆరు నెలల్లో రూ.60 కోట్లు



ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజల సహకారంతో ఆరు నెలల కాలంలోనే రూ.60 కోట్లతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టాం. ఏడాది కాలంలో చేసిన ప్రజాసేవ ఎంతో సంతృప్తినిచ్చింది. 15 వార్డుల్లో ఉండే ప్రజలకు తాగునీటి కోసం ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు, గల్లిగల్లీకి సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, వీధి దీపాలు, శ్మశాన వాటికలు నిర్మించాం. రూ.25 కోట్లతో మంగళ్‌పల్లి నుంచి ఆదిబట్లకు డబుల్‌రోడ్డు నిర్మాణం మైలురాయిగా నిలిచింది. రతన్‌టాటా స్మారకార్థం ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు కోసం తీర్మానం చేశాం. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టా. రాబోయే రోజుల్లో ప్రజలు అవకాశం కల్పిస్తే మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తా.

– మర్రి నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, ఆదిబట్ల

పురోగమనం దిశగా నడిపించాం



ఇబ్రహీంపట్నం: ఐదేళ్ల పాలనలో మున్సిపాలిటీలో రూ.169 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఎంజీఎఫ్, ఎల్ఆర్ఎస్, పీపీ, 14, 15వ ఫైనాన్స్ నిధులతో 24 వార్డులను పురోగమనం దిశగా నడిపించాం. డ్రైనేజీల నిర్మాణానికి రూ.7.46 కోట్లు, ఆర్‌సీసీ డ్రైనేజీలకు రూ.1.75 కోట్లు, సీసీ రోడ్లకు రూ.2.64 కోట్లు, శ్మశాన వాటికలకు రూ.2.81 కోట్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ.1.29 కోట్లు, వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్‌కు రూ.2.28 కోట్లు, స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్, పరమపద వాహనం, జేసీబీ కొనుగోళ్లకు రూ.1.14 కోట్లు, వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణానికి రూ.1.6 కోట్లు, పబ్లిక్ టాయిలెట్స్‌కు రూ.42 లక్షలు, డంపింగ్ యార్డు నిర్మాణానికి రూ.52 లక్షలు, సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశాం. పరిపాలనా కాలంలో సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు.

– కప్పరి స్రవంతి, మున్సిపల్ చైర్ పర్సన్, ఇబ్రహీంపట్నం

మా మున్సిపాలిటీకే అధిక నిధులు



శంకర్‌పల్లి: గడిచిన ఐదేళ్లలో చైర్‌పర్సన్‌గా చేపట్టిన కార్యక్రమాలు సంతృప్తినిచ్చాయి. కొత్త మున్సిపాలిటీ అయినప్పటికీ మిగతా మున్సిపాలిటీలకు దీటుగా పని చేశాం. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, అప్పటి మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, అప్పటి ఎంపీ రంజిత్‌రెడ్డి అండగా నిలిచారు. అప్పట్లో ఏర్పడ్డ ఏ మున్సిపాలిటీకి రూ.100 కోట్ల నిధులు మంజూరు కాలేదు. మా మున్సిపాలిటీకే రావడం గర్వించదగ్గ విషయం. కౌన్సిల్ ఏర్పడగానే ప్రధానంగా పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి వ్యవస్థపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. పచ్చదనం పెంపొందించేందుకు రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటి, సంరక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించుకున్నాం. ఐదేళ్లలో కౌన్సిల్ సహచరులు, కో–ఆప్షన్ సభ్యులు అన్ని సమయాల్లో మద్దతుగా ఉన్నారు. సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

– విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, శంకర్‌పల్లి

మంచు తెరలు

- వాతావరణంలో అనూహ్య మార్పులు
- వేకువజామున కమ్మేస్తున్న పొగమంచు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అంటున్న వైద్య నిపుణులు



చేవెళ్ల: కమ్మేసిన పొగ మంచులో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనం

చేవెళ్ల: కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. వాతావరణంలో రెండుమూడు రోజులుగా అనూహ్య మార్పులు కనిపిస్తున్నాయి. ఉదయం, రాత్రి చలి వణికిస్తుండగా మధ్యాహ్నం ఎండ దంచేస్తోంది. వేకువజామున పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం 8 గంటలు దాటినా మంచు తెరలు వీడడం లేదు. రోడ్లపై ప్రయాణించే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భయంతో లైట్లు వేసుకొని వెళ్తున్నారు. ఇక ఉదయం సమయంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం వెళ్లేవారు, రైతులు చలికి ఇబ్బందులు పడుతున్నారు. అటు చలి, ఇటు ఎండవేడితో ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతవారణంలో జరుగుతున్న మార్పులతో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



మొయినాబాద్‌రూరల్: కాశీబౌలి సమీపంలో..

జాగ్రత్తలు తీసుకోవాలి



అతి చలి, అతి వేడి కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఉదయం పొగ మంచు సమయంలో ప్రయాణాలు, వాకింగ్‌లాంటివి మానుకోవడమే మేలు. ఆస్తమా లాంటి శ్వాసకోశ వ్యాధులు ఉన్న వారు పొగ మంచులో బయటికి రాకుండా ఉండాలి. అత్యవసరమై వెళ్లాల్సి వస్తే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ రాజేంద్రప్రసాద్, చేవెళ్ల ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్



అబ్దుల్లాపూర్‌మెట్: పరుచుకున్న మంచు దుప్పటి



మొయినాబాద్: శ్రీరాంనగర్ వద్ద..

ఉత్సాహంగా డ్రైవర్స్ డే



ఇబ్రహీంపట్నంలో ఆర్టీసీ డిపో సిబ్బంది ర్యాలీ

ఇబ్రహీంపట్నం: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకట నర్సప్ప ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైవర్స్ డే నిర్వహించారు. డిపో నుంచి ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. బస్‌స్టేషన్‌లోని డ్రైవర్లకు గులాబీ పూలు అందించారు. అనంతరం డిపోలో జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ గురునాయుడు మాట్లాడుతూ.. మానసికంగా, శారీరకంగా డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని, రోడ్డు మధ్యలో వాహనం నిలపొద్దని సూచించారు. వేగంగా యూ టర్న్ చేయడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతో చాలా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రమాదరహిత డ్రైవర్లుగా ఎంపికైన ఎండీ జియాద్దీన్, వెంకటయ్య, యాదయ్య (ఆర్టీసీ)తో పాటు అద్దె బస్సు డ్రైవర్లు పి.కృష్ణారెడ్డి, లింగం, మహేశ్, ఎండీ ఖైసర్‌కు ట్రాఫిక్ సీఐ గురునాయుడు, ఎస్ఐ సాయినాథ్ అవార్డులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్, అసిస్టెంట్ ఇంజినీర్ అజయ్, ఎస్‌టీఐ వెంకట్‌నాయక్, ఈడబ్ల్యూబీ మెంబర్ జంగయ్య, సూపర్‌వైజర్లు సదానందం, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బలవంతంగా భూములు లాక్కోవద్దు

కందుకూరు: రైతుల భూములు బలవంతంగా తీసుకోవద్దని సీపీఎం నాయకులు అన్నారు. ఫ్యూచర్ సిటీలో భూములు కోల్పోతున్న బాధిత రైతులతో పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడారు. రూ.60 లక్షలు, రూ.70 లక్షలు ఇచ్చి కారు చౌకగా భూములు కొల్లగొట్టడానికి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ఫ్యూచర్‌సిటీ రహదారి నిర్మాణం కోసం విలువైన భూములను తక్కువ ధరకు తీసుకుని రైతులకు అన్యాయం చేయొద్దన్నారు. 4,725 మంది రైతుల ఉసురు తీసే బదులు శ్రీశైలం రహదారిని విస్తరిస్తే సరిపోతుందన్నారు. తప్పనిసరైతే భూమికి భూమి ఇవ్వాలని లేదంటే బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారంతో పాటు ఎకరాకు వెయ్యి గజాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భూ పోరాట కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుని ప్రకటించారు. భూ పోరాట కమిటీ కన్వీనర్‌గా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా రైతులు వెంకటేశ్‌గౌడ్, బి.తిరుపతి, చంద్రయ్య, లింగం, సురేష్, శాంతమ్మ, వి.శ్రీనివాస్, శ్రీరాములు, సీపీఎం నాయకులు బుడ్డీరపు శ్రీనివాస్, పెంటయ్య, శివశంకర్, ఏర్పుల శేఖర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డిని కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య, జిల్లా కార్యదర్శి జగన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జగదీశ్, జిల్లా శ్రామిక మహిళా విభాగం కార్యదర్శి కవిత, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు రావుల జంగయ్య, సీపీఎం కన్వీనర్ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓకు తమ డిమాండ్లను వివరిస్తున్న నాయకులు, రైతులు

బిస్మాట్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

తుర్కయంజాల్: బడ్జెట్ స్కూల్, చిన్న తరహా స్కూళ్ల పరిరక్షణే ధ్యేయంగా బిస్మాట్ ఆవిర్భవించడం హర్షించదగ్గ విషయం అని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. తుర్కయంజాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన తెలంగాణ బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (బిస్మాట్) రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీపతి శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జగ్గ మల్లారెడ్డి, కోశాధికారిగా జె.శ్రీనివాస రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుజ్జ సత్యం, షేక్ షరీఫ్, కె.దయాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. జలంధర్ రెడ్డి, సలహాదారులుగా రాధాకృష్ణ, టి.బుచ్చిరెడ్డిని ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా జి.నారాయణ రెడ్డి, కార్యదర్శిగా ఎ.భరత్ కుమార్, కోశాధికారి సీహెచ్ మీనేందర్ రావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన సభ్యులతో ఆర్.కృష్ణయ్య

చారిత్రక ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలు

దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్

చేవెళ్ల: చరిత్ర కలిగి ఆదాయం లేని ఆలయాలను గుర్తించి వాటిలో ధూపదీప నైవేద్యాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ అన్నారు. మండలకేంద్రంలోని శివాలయాన్ని శుక్రవారం దేవాదాయశాఖ సూపరింటెండెంట్ చంద్రమౌళి, ఈఓ నరేందర్‌తో కలిసి సందర్శించారు. అర్చకులు ఆలయ విశిష్ట తను వారికి వివరించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ఇలాంటి ఆలయాలను దేవాదాయ శాఖ గుర్తించిందని, ఇప్పటికే వాటిలో పూజలకు సహకరిస్తోందని తెలిపారు. ఈ ఆలయానికి సంబంధించి కోర్టులో కేసు కొనసాగుతోందని, కేసు అయిపోయిన తర్వాత దీనిని కూడా పరిశీలిస్తామని చెప్పారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి లక్ష్యం



ఉద్యోగాలు పొందిన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో శుక్రవారం మెగా జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్ అని కాకుండా ఏదో ఒక రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే ధ్యేయమని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఈ మెగా జాబ్ మేళా నిర్వహించినట్టు తెలిపారు. రాష్ట్రంలో రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. గుజరాత్ రాష్ట్రానికి తరలుతున్న ఫాక్స్‌కాన్ కంపెనీని కేసీఆర్, కేటీఆర్ పట్టుబట్టి కొంగరకలాన్‌లో ఏర్పాటు చేశారన్నారు. రావిర్యాల, తుక్కుగూడ, మహేశ్వరం, చందనవెల్లి, షాబాద్‌లో భారీ పరిశ్రమలు స్థాపించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అంతకు ముందు 25 కంపెనీల ప్రతినిధులు 3 వేల ఉద్యోగాల కోసం ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన వారికి ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, మండల అధ్యక్షుడు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువ తెలుసుకో..

షాద్‌నగర్: ప్రజాస్వామ్యానికి ఓటు పునాది వంటిది. ఓటు హక్కును పొందడం.. వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత.. ఐదేళ్లకు ఓసారి పాలకులను ప్రజలే స్వయంగా ఓటు వేసి ఎన్నుకుంటారు. ఓటర్లు తమ ఓటు హక్కుతో నచ్చిన వారికి అధికారం కట్టబెడతారు.. లేదంటే పదవి నుంచి దింపేస్తారు.. ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటింది. భారత ఎన్నికల సంఘం ఆవిర్భవించిన జనవరి 25ను ఏటా జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకొంటున్నాం.

ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉంది. ఓటర్లుగా తమకున్న హక్కులు, బాధ్యతల గురించి ప్రజలకు తెలియజేసేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఓటర్లను చైతన్య చేసేందుకు ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యత తెలిసే విధంగా ఆటలు, పాటల రూపంలో ప్రజలకు తెలియజేస్తున్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించేందుకు రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



చైతన్యం తీసుకొచ్చేలా..

ఓటు హక్కుపై విద్యార్థి దశలోనే చైతన్యం తేవాలన్న లక్ష్యంతో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో రెవెన్యూ, విద్యాశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ఉదయం ప్రార్థనా సమయంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఉపన్యాసం తదితర పోటీలు నిర్వహిస్తున్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది



ఓటు హక్కును పొందడం ప్రతి పౌరుని బాధ్యత. ఓటు అనేది ప్రజాస్వామ్యానికి పునాది వంటిది. ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రజలను చైతన్యం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాం.

– పార్థసారథి, తహసీల్దార్, ఫరూఖ్‌నగర్

నష్టం చేకూర్చేవారికి కాంగ్రెస్‌లో చోటు లేదు

- మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్
- పార్టీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు మహేందర్‌పై సస్పెన్షన్ వేటు


మాట్లాడుతున్న మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్

కొత్తూరు: కాంగ్రెస్ మున్సిపల్ ఉపాధ్యక్షుడిగా ఉన్న స్టేషన్ తిమ్మాపూర్‌కు చెందిన వస్పుల మహేందర్‌ను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో సుదర్శన్, పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. తప్పులు చేయడంతో పాటుగా పార్టీకి నష్టం చేకూర్చే వారికి పార్టీలో చోటు లేదన్నారు. మహేందర్ కొంతకాలంగా పార్టీకి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఇటీవల ఆయన పలువురు మహిళలను మోసం చేసిన ఘటనలోనూ మహేందర్ జైలుకు వెళ్లాడని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలోను అక్రమాలకు పాల్పడుతున్నాడని.. ఈ ఘటనలకు పార్టీకి సంబంధం లేకుండా ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరిస్తామని తెలిపారు. ఇక నుంచి మహేందర్‌కు కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, శివశంకర్‌గౌడ్, సాయితేజ, రాజు, కృష్ణ, శివ పాల్గొన్నారు.


గంధోత్సవంలో పాల్గొన్న రాఘవేందర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

ఆమనగల్లు: పట్టణం సమీపంలోని బైరాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సైదులు దర్గాలో శుక్రవారం జరిగిన గంధోత్సవంలో టాస్క్ సీఈఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు. సైదులు దర్గా వద్ద సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఫాతేహా సమర్పించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే సైదులు దర్గా ఉత్సవాలలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కుల మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసి పండుగలు జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని దర్గా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

మట్టి తవ్వకాలపై ఎస్‌ఓటీ దాడులు

- రెండు టిప్పర్లు, మూడు జేసీబీలు సీజ్
- ఏడుగురు వ్యక్తులపై కేసు

షాబాద్: అక్రమంగా చేపట్టిన మట్టితవ్వకాలపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు చేపడతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో గురువారం రాత్రి హైతాబాద్ సమీపంలోని పారిశ్రామికవాడ వద్ద సుమారు 90 టన్నుల ఎర్రమట్టి డంప్, ఓ టిప్పర్, రెండు జేసీబీలను స్వాధీనం చేసుకుని నలుగురిపై, శుక్రవారం నరెడ్లగూడలో దాడి చేసి ఓ టిప్పర్, జేసీబీని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

వృద్ధుడు అదృశ్యం


లక్ష్మయ్య (ఫైల్)

యాచారం: కుటుంబ కలహాల కారణంగా ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన జాపాల లక్ష్మయ్య(70) మనస్తాపంతో గురువారం రాత్రి 9గంటల ప్రాంతంలో బయటకు వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం వారు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇంకెన్ని దరఖాస్తులు ఇవ్వాలి

గ్రామ సభల్లో నిరసన జ్వాలలు

- అధికారులను నిలదీసిన ప్రజలు
- శాంతియుతంగా సమాధానమిచ్చిన అధికారులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు శుక్రవారంతో ముగిసాయి. జనవరి 26న ప్రారంభించనున్న నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ సభలు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో జాబితాలో పేరులేని వారు అధికారులను ప్రశ్నించారు. అనర్హులకు పెద్దపీట వేశారని ఆరోపించారు. చివరకు దరఖాస్తులు చేసుకుని వెళ్లిపోయారు.

'లిస్టులో అనర్హులే ఎక్కువ'


ఆందోళన చేస్తున్న నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

దౌల్తాబాద్: స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది. అధికారులు అర్హుల జాబితా చదువుతుండగా గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసాలో అనర్హులు ఎక్కువగా ఉన్నారంటూ బీఆర్‌ఎస్ నాయకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. జాబితాలో పేరు లేని వారు మరో మారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గాయత్రి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ రజనికాంత్, ఏఈఓ వైశాలి, పంచాయతీ కార్యదర్శి గోపాల్ తదితరులున్నారు.

ఇది జాబితా మాత్రమే.. ఫైనల్ కాదు


తాండూరు రూరల్: అంతారంలో నాయకుల ఆందోళన

తాండూరు రూరల్: గ్రామాల్లో ప్రజల నుంచి నిరసనలు ఎదురవుతుండడంతో అధికారులు, నాయకులు ఇందిరమ్మ ఇళ్ల జాబితా చదివి వినిపించలేదు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో ఒక్కో గ్రామానికి పది నుంచి 15 ఇళ్లు మాత్రమే వచ్చే అవకాశం ఉంటుంది. ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు రావడంతో అధికారులు, నాయకులు అర్హుల జాబితా చదివి చేతులు దులుపుకొన్నారు. సంగెం కళాన్ గ్రామంలో 308, అంతారంలో 370 మంది అర్హులున్నట్లు పేర్లను చదివి లిస్ట్ ఫైనల్ కాలేదని చెప్పారు. ఈ సమావేశాలతో పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

సభలతో ఒరిగేది ఏముంది?


అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం

నవాబుపేట: ప్రజాపాలన గ్రామసభలతో ఒరిగేదేమీ లేదని ప్రజలు అధికారులపై మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో అధికారులు ఎజెండా చదువుతుండగా.. గ్రామస్తులు ఒక్కసారిగా ఈ సభలతో వచ్చేది పోయేదేమీలేదని మండిపడ్డారు. అధికారులకు, ప్రజలకు టైం వేస్ట్ తప్ప ఇప్పటి వరకు ఏ సమస్య పరిష్కరించారో చెప్పాలని ప్రశ్నించారు. పథకాలన్నీ పార్టీలకు తొత్తులుగా ఉన్నవారికే అందుతున్నాయని.. పేదలకు ఎవరూ ఏం చేయరని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు అర్హులదరికీ పథకాలు వస్తాయని .. పేరు లేని పేదలుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నక్కర్తమేడిపల్లిలో అదృశ్యం.. శేరిగూడలో ప్రత్యక్షం


శేరిగూడలో బైక్‌పై ప్రత్యక్షమైన భానుప్రసాద్

యాచారం: నక్కర్తమేడిపల్లిలో అదృశ్యమైన విద్యార్థి ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడలో ప్రత్యక్షమయ్యాడు. వివరాలు.. గ్రీన్‌ఫార్మాసిటీ ఠాణా పరిధి నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన గొరిగె భిక్షపతి, పార్వతమ్మ దంపతుల కుమారుడు భాను ప్రసాద్ అదృశ్యమైన విషయం విదితమే.. గ్రామం నుంచి నగరంలో ఉన్న మిత్రుడి వద్దకు వెళ్లేందుకు బయలు దేరిన విద్యార్థి శేరిగూడ వద్దకు చేరుకోగానే బైక్‌లో పెట్రోల్ అయిపోయింది. దీంతో రాత్రంతా అక్కడే చెట్ల పొదల్లో ఉన్నాడు. శుక్రవారం తెల్లవారు జామున భానుప్రసాద్‌ను గుర్తించిన నక్కర్తమేడిపల్లి గ్రామస్తులు తండ్రికి సమాచారం ఇచ్చారు. భిక్షపతితో పాటు కుటుంబ సభ్యులు శేరిగూడకు వెళ్తుండగా భానుప్రసాద్ బైక్‌పై నక్కర్తమేడిపల్లి గ్రామానికి వస్తుండగా గురునానక్ కళాశాల వద్ద పట్టుకున్నాడు. తమ కొడుకు క్షేమంగా ఇంటికి రావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల్లో సంతోషం వ్యక్తమైంది. గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు రాత్రంతా ఎక్కడికి వెళ్లావ్ అని భాను ప్రసాద్‌ను ప్రశ్నిస్తే తనకు గుర్తు లేదని సమాధానం ఇచ్చాడు.

పంచాయతీ కార్మికుడిపై దాడి

కేసు నమోదు చేసిన పోలీసులు

కేశంపేట: గ్రామ పంచాయతీ ట్రాక్టర్ నుంచి బ్యాటరీ తీసుకెళ్తుండగా గమనించిన పంచాయతీ కార్మికుడిపై ఓ కుటుంబం దాడి చేసింది. ఈ ఘటన మండల పరిధిలోని చింతకుంటపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు, సీఐ నరహరి తెలిపిన ప్రకారం.. గ్రామానికి గుండోళ్ల జంగయ్య వారం రోజుల క్రితం తన వాహనానికి బ్యాటరీ అవసరం ఉందని, పంచాయతీ ట్రాక్టర్ నుంచి బ్యాటరీ తీసుకుని మళ్లీ ఇస్తానని పంచాయతీ కార్యదర్శి మురళిని సంప్రదించాడు. ఇవ్వడం కుదరదని చెప్పినప్పటికీ వినకుండా ట్రాక్టర్ బ్యాటరీని తీసుకెళ్లాడు. ఇది పంచాయతీ కార్మికుడు నాగపోలు రాములు గమనించడంతో రెండు రోజుల తర్వాత ట్రాక్టర్ బ్యాటరీ తెచ్చి ఇచ్చాడు. తీసుకెళ్లేప్పుడు రాములు గమనించడం అవమానం జరిగిందనే భావనతో విధుల్లో ఉన్న రాములుపై జంగయ్య, ఆయన భార్య లక్ష్మమ్మ, కుమారుడు శివ దాడి చేశారు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి


పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ సాయి చైతన్య, కళాశాల బృందం

యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య

శంకర్‌పల్లి: మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య సూచించారు. మండలంలోని దొంతాన్‌పల్లిలో ఉన్న ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో యాంటి నార్కోటిక్ బ్యూరో, కళాశాల యాజమన్యం సంయుక్తంగా నిర్వహిస్తున్న 'నిరామయ తరంగ్' కార్యక్రమానికి సంబంధించిన లోగో పోస్టర్‌ని శుక్రవారం కళాశాల వైస్ చాన్సలర్ ఎల్.ఎస్.గణేశ్, రిజిస్ట్రార్ విజయలక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వాడకంతో మనిషితన వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా కోల్పోతారని అన్నారు. దీనిపై విద్యార్థులు పట్టణ, గ్రామస్థాయిలో తిరిగి అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. యువత డ్రగ్స్‌కి బానిస కావొద్దని సూచించారు. వీసీ గణేశ్ మాట్లాడుతూ.. నిరామయ తరంగ్ అనే పేరును సంస్కృతం నుంచి తీసుకున్నామని తెలిపారు. నిరామయ అంటే ఎలాంటి అపవిత్రత లేని జీవనం అని, తరంగ్ అంటే సానుకూల దృక్పథం అని వివరించారు. కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ హరీశ్ చంద్రరెడ్డి, కళాశాల డైరెక్టర్ ఎస్.పి.విశ్వనాథ్, జాయింట్ రిజిస్ట్రార్ మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి


పగిలిన ఫ్లోర్ బండలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి

యాచారం: ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని నందివనపర్తి ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రోగులను అడిగి వైద్య సేవలపై ఆరా తీశారు. సరిపడా మందులు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య ఉపకేంద్రం మరమ్మతులకు కావాల్సిన నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని చెప్పారు.

భిన్నమతాల సమ్మేళనం జేపీ దర్గా


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ప్రీతం

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం

కొత్తూరు: భిన్నమతాల సమ్మేళనం జేపీ దర్గా అని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వలో ఉన్న జేపీ దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబాకు చాదర్ సమర్పించారు. ఆయన వెంట నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్, నాయకులు శ్రీను, భాస్కర్, అనంతయ్య, యాదగిరి, కుమార్, సాయిలు, జగన్, కృష్ణ, రవి, శివ, రాజేందర్ తదితరులు ఉన్నారు.

సాంకేతిక విద్య.. దేశాభివృద్ధికి దోహదపడాలి


సదస్సులో ప్రసంగిస్తున్న బాలకృష్ణారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సాంకేతిక విద్య సమాజ, దేశాభివృద్ధికి దోహదపడాలని సాంకేతిక విద్యా మండలి చైర్మన్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. మంగళ్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు కొనసాగనున్న ×సస్టెయినబుల్ మెటీరియల్స్, టెక్నాలజీస్ అప్లికేషన్స్ ఇన్ ఇంజనీరింగ్¤ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ డాక్టర్ అమరనాథ్‌రెడ్డి, కళాశాల చైర్మన్ రాఘవ చెరబుడ్డి, ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటిని కూల్చేస్తామని బెదిరింపులు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


కుమార్ (ఫైల్)

నందిగామ: ఇంటిని కూల్చివేస్తామని కొందరు వేధించడంతో ఓ యజమాని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో నర్సప్పగూడలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, నందిగామ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అంకం కుమార్(32) ఇటీవల గ్రామంలో ఇల్లు నిర్మించుకున్నారు. నిర్మాణ దశ నుంచే ఆ ఇల్లు తమ పట్టా పొలంలో ఉందని అదే గ్రామానికి చెందిన మంగళి నందమయ్య, రాజు, కుమార్, లింగం, రవి, అనిల్‌లు నిత్యం బెదిరించేవారు. ఈ క్రమంలోనే అంకం కుమార్ గృహ ప్రవేశం చేశారు. ఈ మధ్య కాలంలో వేధింపులు అధికమవ్వడంతో గురువారం రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. తన భర్త చావుకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య తేజస్విని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో సైతం మంగళి నందమయ్యతో పాటు ఆయన కుమారులు వేరే చోట నిర్మించుకున్న ఇంటిని కూల్చి వేశారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

సీఎంకు స్వాగతం.. సన్మానం

షాద్‌నగర్/అబ్దుల్లాపూర్‌మెట్: పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి గురువారం శంషాబాద్ విమానాశ్రమంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి స్వాగతం పలికారు. విదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకొని తిరిగి వచ్చిన సందర్భంగా ఘనంగా సన్మానించారు.



సీఎం రేవంత్ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చిత్రంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు